సాక్షి
తిరుపతి

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



ఖోఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక
పంగూరు జెడ్పీ హైస్కూలులో రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక జరిగినట్లు హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. - 10లో



కమీషన్లకే సలాం!
రోడ్లు ధ్వంసమైతే మాకొచ్చే నష్టమేంటి? మా మూళ్లతో జేబులు నిండితే చాలన్నట్టుగాఉన్న పోలీసుల తీరుపై విమర్శలొస్తున్నాయి. - 10లో



సహకారం..పోరు రసవత్తరం
టీటీడీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు సోమవారం రసవత్తరంగా సాగాయి. - 10లో

న్యూస్‌రీల్

ఎస్వీయూకు ఎన్ఆర్ఐ విరాళం



విరాళం చెక్కును వర్సిటీ అధికారులకు అందజేస్తున్న మాజీ ఎడిటర్ జేవీ లక్ష్మణరావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ దూరవిద్య ద్వారా మనోవిజ్ఞాన శాస్త్రం అభ్యసించిన అమెరికాలోని చికాగో చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు, ఇండియా ట్రిబ్యూన్ పత్రిక మాజీ ఎడిటర్ జేవీ లక్ష్మణరావు వర్సిటీ అభివృద్ధి కోసం రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు చెక్కును వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు సోమవారం అందజేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం దూరవిద్య విభాగంలోని తరగతి గది కోసం విరాళం వినియోగించాలని దాత అధికారులను కోరారు. ఏపీ తణుకులో జన్మించిన ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ది హిందూ, డెక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రికల్లో ఎడిటర్‌గా పనిచేశారు. 65 ఏళ్ల పాటు దేశ, విదేశీ పత్రికారంగంలో పనిచేసిన ఆయన దేశ ప్రథమ ప్రధాని నెహ్రూ, సీఎంలు ఎన్టీఆర్, చెన్నారెడ్డికు మీడియా సలహాదారుగా పనిచేశారు. 87 ఏళ్ల వయస్సులో ఎస్వీయూ దూరవిద్య ద్వారా మనోవిజ్ఞాన శాస్త్రాన్ని అభ్యసించడంపై వర్సిటీ అధికారులు ఆయనను అభినందించి, దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోవిజ్ఞాన శాస్త్ర ఐసీఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెలో, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ఇంజినీర్ తాండవ కృష్ణ, డీడీఈ డైరెక్టర్ ఆచార్య తవమణి, డీఆర్ సునీత, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో అర్జీలను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: రెవెన్యూ సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 211 అర్జీలు వచ్చాయని చెప్పారు. అందులో 143 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో మండల స్థాయి నుంచే తహసీల్దార్లు రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి చిన్న సమస్యకు వారు కలెక్టరేట్‌కు రావడం ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పూర్తి సమాచారంతో రండి

తిరుపతి అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు జరగనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, అనగాని సత్యప్రసాద్ సమావేశానికి పూర్తి సమాచారంతో అధికారులందరూ హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి సమావేశానికి అధికారులు అంతా తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. డీఆర్వో పెంచల కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లకు బుకింగ్

తిరుపతి అర్బన్: జిల్లాలోని అర్హులైన మహిళలు ఈ నెల 29వ తేదీ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ముందుగా గ్యాస్ ఏజెన్సీకి లబ్ధిదారుడు నగదు చెల్లించాలని చెప్పారు. ఆ తర్వాత 48 గంటల్లో ప్రభుత్వం నుంచి ఆ నగదు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. రెండో సిలిండర్ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి జూలై మధ్యలో బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. మూడో సిలిండర్ వచ్చే ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ మధ్యలో బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్‌కార్డుతోపాటు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ అయి, ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో 6,00,307 రేషన్‌కార్డులు ఉన్నాయని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 69,333 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,606 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది.

పులికాట్‌కు గర్భశోకం!



పులికాట్ సరస్సు

పులికాట్.. ప్రకృతి సంపదకు నిలయం.. ఈ సరస్సు వానపాములు, పలు రకాల మీనజాతులు..మరెన్నో రకాల పక్షులకు ఆవాసం.. జీవ వైవిధ్యం, ప్రకృతి సౌందర్యం దీని సొంతం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సరస్సు అక్రమార్కుల స్వార్థం.. వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారుల నిర్లక్ష్యం.. కూలీలు అధిక ఆదాయం కోసం అక్రమ తవ్వకం.. వెరసి.. పర్యావరణానికి విఘాతం.. వానపాములు, మీన జాతుల ఉనికి ప్రశ్నార్థకం.. ఫలితం ప్రకృతి ప్రసాదితమైన ప్రళయకావేరికి మిగలనున్న గర్భశోకం.



ప్లాస్టిక్ బక్కెట్లలో పులికాట్ సరస్సు నుంచి తవ్వి తీసిన వానపాములు

- యథేచ్ఛగా వానపాముల తవ్వకాలు
- సిబ్బంది లేమితో చేతులెత్తేస్తున్న వైల్డ్‌లైఫ్ అధికారులు
- వేనాడు, ఇరకం దీవుల్లో రెచ్చిపోతున్న అక్రమార్కులు

సూళ్లూరుపేట: ఆంధ్రా–తమిళనాడు రాష్ట్రాల పరిధిలో ప్రకృతి వరప్రసాదితమైన పులికాట్ సరస్సు ప్రమాదపుటంచున ఉంది. సరస్సు గర్భంలో సహజ సిద్ధంగా ఏర్పడిన వానపాములను ఇబ్బడి ముబ్బడిగా తవ్వేయడంతో భవిష్యత్తులో సరస్సు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగంలో సిబ్బంది కొరత, రాజకీయం, వానపాములకు సంబంధించి సరైన చట్టం లేకపోవడం, వైల్డ్‌లైఫ్ సిబ్బందిలో కొంతమంది ఈ అక్రమ వ్యాపారంలో భాగస్వాములుగా కావడంతో దీన్ని అరికట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు తీరప్రాంత గ్రామాల్లో ఉండే కూలీలను ప్రోత్సహించి, వానపాముల తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో సరస్సు గుంటలు మిట్టలుగా మారి సహజత్వాన్ని కోల్పోతోంది. పదేళ్ల కిందట ప్రారంభమైన వానపాముల తవ్వకం నేడు తారస్థాయికి చేరింది. సూళ్లూరుపేట, తడ మండలాల్లో కొంతమంది ఈ వ్యాపారాన్ని ఎంచుకుని, ఈ రెండు మండలాల్లో స్టాక్‌పాయింట్లు పెట్టి, వానపాములను తరలిస్తున్నారు. తడ మండలం వేనాడు, ఇరకం, అటకానితిప్ప, పేర్నాడు దీవులకు చుట్టు వానపాముల తవ్వకాలు ఒక పరిశ్రమలా సాగుతోంది. వానపాముల అక్రమరవాణా చేసేవారు వేనాడు దీవిలోని మూల, పల్లిపేట కుప్పం, వేనాడులోని వ్యవసాయ కూలీలను ప్రోత్సహించి ఈ పని చేయిస్తున్నారు. కూలీలు తమకు చేతినిండా పని దొరుకుతుండడంతో తవ్వకాలపై ఆసక్తి చూపుతున్నారు. కిలో వానపాములు తీస్తే రూ.900 వరకు ఇస్తుండడంతో ఒక్కో ఇంటి నుంచి ఇద్దరేసి చొప్పున వెళ్లి రెండు కిలోలు పైగా పట్టి అక్రమ రవాణా చేసే వారికి అందజేస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ నాలుగైదు గంటలు కష్టపడితే రోజుకు సుమారు రూ.1,800 కూలీ వస్తుండడంతో ఈ రెండు దీవుల్లోని కూలీలు ఎక్కువమంది వానపాములు పట్టే పనికి వెళుతున్నారు.

దాడులేవీ?



తరలించేందుకు సిద్ధం చేస్తున్న వానపాములు(ఫైల్)

వానపాములు అక్రమ రవాణా చేసేవారితో వన్యప్రాణి సంరక్షణ శాఖ సిబ్బంది కొంతమంది చేతులు కలిపి నెల మామూళ్లు తీసుకుని, వారికి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఇచ్చే జీతాలను తీసుకుంటూ మరోవైపు అక్రమ సంపాదనకు అలవాటు పడిన వన్యప్రాణి సంరక్షణ శాఖ సిబ్బంది, అక్రమార్కులకు వానపాముల అక్రమ రవాణా సిరులు పంట పండిస్తోంది. ఎవరో సమాచారం ఇస్తే తప్ప సిబ్బంది నిఘా వేసి దాడులు చేసి పట్టుకున్న సందర్భాలే లేవు. గత మూడేళ్లుగా తీసుకుంటే సుమారు 20 సార్లు దాడులు చేసి, కేసులు నమోదు చేస్తే, ఈ ఏడాది కేవలం రెండే కేసులు నమోదు చేశారు. కేసుల నమోదే వీరి పనితీరునకు నిదర్శనంగా నిలుస్తోంది. దీనిపై కఠిన చట్టం లేకపోవడంతో వానపాముల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఫలితంగా పులికాట్ సరస్సు ఉనికికే ప్రమాదం పొంచి ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

సూళ్లూరుపేటలోని పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం (వైల్డ్‌లైఫ్) కార్యాలయాన్ని సిబ్బంది కొరత పీడిస్తోంది. ఫీల్డ్ బీట్ ఆఫీసర్లు 19 మంది ఉండాల్సి ఉండగా 12 మంది మాత్రమే ఉన్నారు. అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు 23 మందికిగానూ ఒకే ఒక్కరు ఉన్నారు. సెక్షన్ ఆఫీసర్లు ఇద్దరికి ఒక్కరే వున్నారు. రేంజర్ ఆఫీసర్లు ఇద్దరికి ఇద్దరూ సున్నారు. అంటే కార్యాలయాలకు పరిమితమయ్యే అధికారులు మాత్రమే ఉన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన ఎఫ్‌డీఓలు, ఏబీఓలు మాత్రం లేరు. దీంతో అక్రమార్కులకు వానపాముల అక్రమ రవాణాకు వరంగా మారింది. దీంతో ఎక్కడ పడితే అక్కడ తవ్వి, వానపాములను వెలికితీసి పులికాట్ సరస్సును సర్వనాశనం చేస్తున్నారు.

వేనాడు, ఇరకం, పేర్నాడు దీవులు కేంద్రంగా తవ్వకాలు

వేనాడు ఇరకం, పేర్నాడు దీవులు కేంద్రంగా వానపాముల తవ్వకం, అక్రమ రవాణా సాగుతోంది. కూలీలు తవ్వి తీసిన వానపాములను పాలిథిన్ కవర్లలో వేసుకుని స్టాక్‌పాయింట్లకు తరలిస్తున్నారు. స్టాక్‌పాయింట్లలో థర్మాకోల్ షీట్లతో తయారు చేసిన బాక్సులు, కుండలు, ప్లాస్టిక్ బక్కెట్లలో ప్యాక్ చేసి ఖరీదైన కార్లలో వీటిని ఉమ్మడి ప్రకాశం, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని అక్వా హేచరీలకు తరలిస్తున్నారు. పులికాట్ సరస్సులో దొరికే వానపాములకు రొయ్యల హేచరీల్లో మంచి డిమాండ్ ఉండడంతో ఈ ప్రాంతంలోని చాలామంది ఈ అక్రమ వ్యాపారాన్ని నడుపుతున్నారు. కిలో వానపాములు పడితే కూలీకి రూ.750 నుంచి రూ.900 ఇస్తున్నారు. జిల్లాలోనే కాకుండా ప్రకాశం, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లోని హేచరీలకు తరలించి విక్రయించే వారికి కిలోకు రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ధరలు పలుకుతుండడంతో అక్రమార్కులు ఈ వ్యాపారాన్ని ఎంచుకుని పులికాట్ సరస్సు గర్భాన్ని వుండు చేసేస్తున్నారు. ముఖ్యంగా అధికారపార్టీ నేతల అండదండలు చూసుకుని సూళ్లూరుపేట మండలంలోని పేర్నాడు ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు ఈ వ్యాపారాన్ని అడ్డూ అదుపు లేకుండా సాగిస్తున్నారు.



థర్మాకోల్ బాక్స్‌ల్లో పార్శిల్ చేసిన వానపాములు (ఫైల్)

పర్యావరణానికి ముప్పు



పులికాట్ సరస్సులో వానపాములు తవ్వి తీయడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే విదేశీ వలస విహంగాలు కూడా రాకుండా పోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. పక్షుల భూతల స్వర్గంగా పేరున్న పులికాట్ సరస్సు ప్రాంతం కనుమరుగైపోయే అవకాశం లేకపోలేదు. వానపాములు అక్రమరవాణాను అడ్డుకునే విషయంలో సిబ్బంది కొరతను సాకుగా చూపిస్తున్నారు. వానపాములనేవి ప్రకృతి సహజసిద్ధంగా పులికాట్ గర్భంలో ఏర్పడతాయి. వాటిని తీసేస్తే ఇటు మత్స్య సంపద అభివృద్ధి అగిపోతోంది.

– సన్నారెడ్డి గోపీనాథ్‌రెడ్డి, పులికాట్ లేఖ్ బర్డ్స్ లవర్ సొసైటీ వ్యవస్థాపకులు

మత్స్యసంపద క్షీణిస్తుంది



పులికాట్ సరస్సులో వానపాములు తవ్వి తీయడంతో మత్స్యసంపద క్షీణిస్తోంది. దీన్ని వెంటనే ఆపాల్సిన అవసరం ఉంది. వానపాములు పులికాట్ గర్భంలో లేకపోతే మత్స్య సంపదకు ముప్పు ఏర్పడుతుంది. ఇప్పటికే అనేక రకాలైన చేపజాతులు నశించిపోయాయి. చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవనం సాగించే సంప్రదాయ జాలర్లుకు ఇప్పటికే జీవనోపాధి తగ్గుతోంది. పులికాట్ సరస్సును సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నప్పటికీ ఎవరూ దీనికోసం ప్రయత్నించడం లేదు. పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

–శివాజీ, మత్స్యకార సంఘం నాయకుడు

ప్రత్యేక దృష్టి సారిస్తాం

వానపాములు అక్రమ రవాణా జరుగుతోందని నా నోటీస్‌లో ఉంది. నేను డీఎఫ్‌ఓగా ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, తగు చర్యలు తీసుకుంటాను. సిబ్బంది కొరత విషయం కూడా నాపై అధికారులకు తెలియజేసి భర్తీ చేసేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను. ఇప్పటికే కొన్ని పరిస్థితులపై నేను అధ్యయనం చేస్తున్నాను. వానపాములు తవ్వకాల విషయం ప్రత్యేకంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తాను.

– హారిక, డీఎఫ్‌ఓ, పులికాట్‌వన్యప్రాణి సంరక్షణ విభాగం, సూళ్లూరుపేట

చెర వీడేనా..సమస్య తొలిగేనా?

- రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వినతి
- ప్రభుత్వ భూములతో నేతల వ్యాపారం
- గ్రీవెన్స్‌లో 90 శాతం రెవెన్యూ సమస్యలే
- తిరుపతిలో కొంకచెన్నాయిగుంట కబ్జా
- శ్రీకాళహస్తిలో కళాశాల స్థలం ఆక్రమణ
- ఆరూర్ అటవీ భూములు ఆక్రమణ

తిరుపతి జిల్లాలో రెవెన్యూ సమస్య కోకొల్లలు.. నేతల భూ్య ఆక్రమణలు.. ఖాళీ భూములు లేఅవుట్‌లుగా మార్చి విక్రయం.. ప్రభుత్వ భూములు కబ్జా.. వీటిపైనే గ్రీవెన్స్‌కు అధిక అర్జీలు.. పరిష్కారం కోసం జనం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు,, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వీటిని పరిష్కరించాలని విన్నపం.



రామచంద్రాపురంలో ఆక్రమణకు గురైన స్థలం



తిరుపతిలోని కొంకచెన్నాయి గుంటలో ఆక్రమణలు

తిరుపతి అర్బన్: మంత్రిగారూ రెవెన్యూ సమస్యలు పట్టించుకోండి సారూ.. అని ప్రజలు వేడుకుంటున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచింది. అయితే నేతలు పోటీపోటీగా ప్రభుత్వ భూములతో వ్యాపారం చేస్తున్నారు. ఖాళీగా ఉంటే ఆక్రమించుకుని లేఅవుట్లు ఏర్పాటు చేసి, అమ్మేస్తున్నారు. లేదా ఎవరైనా ఆక్రమించుకుని ఉంటే వాటితో వ్యాపారం చేస్తున్నారు. అంతేతప్ప ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమించుకోవడం తప్పు అనే మాట ఎక్కడ చెప్పడం లేదు. దీంతో బడా నేతల బాటలోనే చోట నేతలు పయనిస్తున్నారు. ఎవరి స్థాయికి వారు ఆక్రమణలకు శ్రీకారం చుట్టారు. మరోవైపు జూన్ నుంచి అక్టోబర్ వరకు గ్రీవెన్స్‌కు 3,560 అర్జీలు వచ్చాయి. అందులో సుమారుగా 3 వేల అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. వాటి పరిష్కారం కోసం అధికారులు చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేదు. కోర్టు కేసులంటూ అధికారులు తప్పుకుంటున్నారు. దీంతో పలువురు నానా తిప్పలు పడుతున్నారు.

గూడూరులో

గూడూరు నియోజకవర్గంలో గూడూరు రూరల్ ప్రాంతంలోని వెండోడు సమీపంలోని ప్రభుత్వ భూములతోపాటు చెరువులు ఆక్రమించారు. మరోవైపు చిట్టమూరు మండలంలోని ఆరూర్ పంచాయితీ పరిధిలోని 432 సర్వే నంబర్‌లో ఉన్న రిజర్వు ఫారెస్ట్ భూములు 400 ఎకరాలను టీడీపీ నేతలు ఆక్రమించారు. అయినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెతి చూడడం లేదు.

శ్రీకాళహస్తిలో...

శ్రీకాళహస్తి పట్టణంలోని చెంచులక్ష్మికాలనీ సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన స్థలాన్ని ఆక్రమంచి ప్లాట్లు వేసుకుంటున్నారు. దీంతో పలువురు అభ్యంతరాలు చెప్పడంతో కళాశాల అధ్యాపకులు ప్రహరీగోడ ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేశారు. అయితే ఆక్రమణదారులు ప్రహరీగోడ నిర్మించకుండా అడ్డుకుంటున్నారు. మరోవైపు వికృతిమాల సమీపంలో వెల్ఫేర్ గ్రూఫ్ ఆఫ్ ఇండస్ట్రీ పేరుతో డీకేటీ భూములతోపాటు బఫర్ జోన్‌కు చెందిన భూములు ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కృషి చేస్తున్నారు. వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లోని ఖాళీ భూములు కనిపిస్తే టీడీపీ కూటమి నేతలు ఆక్రమించి సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. అయినా పట్టించుకునే నాథుడే లేరు. దీనిపై జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

తిరుపతిలో ఆక్రమణలపై బేరసారాలు

భూ ఆక్రమణలు చోటుచేసుకుంటే వాటికి పరిష్కారం చూపాల్సిన కూటమి నేతలు బేరాసారాలు చేయడం విడ్డూరంగా ఉంది. ఇటీవల కొంక చెన్నాయి గుంటను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే, ఓ వైపు టీడీపీ నేతలు, మరోవైపు జనసేన నేతలు మీ వద్దకు రెవెన్యూ అధికారులు రాకుండా చూస్తాం.. ఒక్కో ప్లాట్‌కు రూ. 5 లక్షల నుంచి రూ.7 లక్షలు మాకు ఇస్తే సరిపోతుందని బేరసారాలు చేస్తున్నారు. కొంక చెన్నాయిగుంటతోపాటు నగర పరిధిలోని పలు చెరువులు, కుంటల పరిస్థితి ఇలానే ఉంది.

- చంద్రగిరి నియోజకవర్గం లోని రామచంద్రాపురం మండలంలోని సర్వే నంబర్ 432–1లో నాలుగు ఎకరాల ఐదు సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీకి చెందిన ఓ స్థానిక నేత భూమిని చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. రూ.కోట్ల విలువ చేసే ఈ భూమి ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- తిరుపతి అర్బన్ మండలం సర్వే నంబర్ 85లో 80 ఎకరాల చెరువు ఉంది. తిరుపతి మహానగరంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ చెరువుపై టీడీపీ నేతల కన్నుపడింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చెరువు ఆక్రమణకు తెగపడ్డారు. ప్రస్తుతం 3 ఎకరాలు ఆక్రమించి ఏకంగా ప్రహరీగోడ నిర్మించారు. అందులో లేఅవుట్లు వేసి, ప్లాట్లుగా విక్రయం ప్రారంభించారు. రూ.కోట్ల విలువ చేసే చెరువులను చెరపట్టకుండా ఆపాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు.



తిరుపతి అర్బన్‌లోని ఓ చెరువు

క్రీడలను ప్రోత్సహించండి



అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: క్రీడలను మరింతగా ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మంగళం ప్రాంతంలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ క్రీడాకారులు జంప్ రోప్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాల్లో రాణించేలా పునాదులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచాయతీరాజ్ ఏఈ సస్పెన్షన్


సస్పెండ్ అయిన దయాక్

సైదాపురం: పంచాయతీ రాజ్ ఏఈ వీవీ దయాక్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో చిట్టమూరు పంచాయతీ రాజ్ ఏఈగా పనిచేస్తున్న వీవీ దయాక్ ఇటీవల బదిలీపై సైదాపురం ఏఈగా విచ్చేశారు. అంతకు ముందు ఈయన వాకాడు ఏఈగా పనిచేశారు. అప్పట్లో అక్కడే నాలుగు లారీల సిమెంట్‌ను బహిరంగ మార్కెట్లో అమ్మేశారని విమర్శలుండేవి. ప్రతి పనికి 10 నుంచి 20 శాతం వరకు మామూళ్ల వసూలు చేస్తున్నారన్న విమర్శలుండేవి. దీంతో అధికారులు కొన్ని రోజులు ఆయన్ని సస్పెండ్ చేశారు. అధికారులను మేనేజ్ చేసి మళ్లీ చిట్టమూరుకు పోస్టింగ్ తెచ్చుకున్నారు. అక్కడి నుంచి మళ్లీ సైదాపురం పంచాయతీరాజ్ ఏఈగా విధులకు హాజరయ్యారు. సుమారుగా రూ.1.07 కోట్లు అవినీతికి పాల్పడిన్నట్లు ఉన్నతాధికారులు చేసిన విచారణలో రుజువు కావడంతో ఆయనపై మళ్లీ వేటు వేసినట్లు తెలిసింది. అధికారికంగా సైదాపురం ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందలేదు. ఈ విషయమై సంబంధిత డీఈని వివరణ కోరగా ఏఈ దయాల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని చెప్పారు. సుమారు రూ.1.07 కోట్ల మేరకు అక్రమాలకు పాల్పడడంతో ఆయన సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ పద్మలత

తిరుపతి క్రైమ్: నేటి ఆధునిక యుగంలో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీఐడీ డీఎస్పీ పద్మలత పేర్కొన్నారు. కరకంబాడి సమీపంలో ఉన్న ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కే కొద్దీ సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. నేటి యువతరానికి సైబర్ క్రైమ్ పై పూర్తిస్థాయిలో అవగాహన ఉంటే కొంత వరకైనా దాన్ని నిర్మూలించవచ్చన్నారు. చాలామంది అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారని పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే లింకులు, వాట్సాప్‌కి వచ్చే మెసేజ్‌లకు ఆకర్షితులై వారి వలలో పడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రమైతే మాకేంటి?

కమీషన్లకే సలాం!


అధిక టన్నేజీతో వెళుతున్న కంకర లారీ

- సత్యవేడు సర్కిల్ పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు
- రోడ్లు ధ్వంసమవుతున్నా అధిక టన్నేజీ లారీలకు పోలీసుల రైట్..రైట్

సాక్షి టాస్క్‌ఫోర్స్: రోడ్లు ధ్వంసమైతే మాకొచ్చే నష్టమేంటి?.. నెల మామూళ్లతో తమ జేబులు నిండితే చాలు– అన్న చందాన వ్యవహరిస్తున్న సత్యవేడు సర్కిల్ పోలీసుల తీరుపై నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, సత్యవేడు, నాగలాపురం మండలాల ప్రజల నుండి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సత్యవేడు మండలం చమర్తకండ్రిగ ప్రాంతంలో ఉన్న మూడు కంకర క్వారీల నుండి రోజువారీ 150 టిప్పర్లకు పైగా తమిళనాడుకు కంకరను తరలిస్తాయి. అయితే పరిమితికి మించి అధిక టన్నేజీ బరువుతో నిత్యం టిప్పర్ల రాకపోకల కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతోంది. ప్రధానంగా చిన్న పాండూరు నుంచి చమర్తకండ్రిగ వరకు సుమారు 12కిలోమీటర్ల దూరం ఆర్అండ్‌బీ రోడ్డు బావులను తలపించే గుంతలతో ఛిద్రమైంది. డబుల్ రోడ్డుగా ఉన్న ఈ మార్గం కేవలం కంకర లారీల తాకిడికే ఇంత అధ్వానంగా ధ్వంసమైనట్లు స్థానికులు చెబుతున్నారు. అంతేకాక చిన్న పాండూరు నుంచి సత్యవేడు వరకు కూడా కంకర లారీల తాకిడికి అక్కడక్కడా రోడ్డు మరమ్మతులకు గురైంది. ఈ కారణంగా నిత్యం నాగలాపురం రోడ్డు మార్గంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో పోలీసులు మొక్కుబడి సూచనలకు పరిమితమవడం మినహా లారీల కట్టడికి ఏమాత్రం చొరవ చూపకపోవడం వారి లోపాయికార అక్రమ వసూళ్లకు పరాకాష్ట అని ఆ ప్రాంత స్థానికులు మండిపడుతున్నారు.

నిలువరించేనా?

పరిమితికి మించి అదనపు టన్నేజీలతో తమిళనాడుకు వెళ్తున్న టిప్పర్ లారీలను పోలీసులు నిలువరించే పరిస్థితి ఉందా? అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. అదనపు టన్నేజీతో వెళ్తున్న టిప్పర్ లారీల ముసుగులో దాదాపుగా నెలకు రూ. 20లక్షల వరకు లారీ యజమానుల నుంచి సత్యవేడు సర్కిల్ పోలీస్ శాఖకు ముడుపులు అందుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అదనపు టన్నేజీ లారీల నియంత్రణ పోలీసులకు సాధ్యమేనా? అన్న ప్రశ్న ప్రస్తుతం స్థానిక ప్రజల నోట వినిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అధిక టన్నేజీ రవాణా చేస్తున్న వాహనాలపై దృష్టి సారించాల్సి ఉంది.

కమీషన్లతో సరి.. రోడ్ల ధ్వంసం పట్టించుకోరు మరి!

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం కాకుండా పర్యవేక్షించాల్సిన పోలీసులే కమీషన్లకు కక్కుర్తి పడి ఏకంగా అక్రమాలకు వంత పాడడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వం విధించిన నిబంధనల మేరకు 35 టన్నుల రవాణా చేయాల్సిన లారీలు ఏకంగా 50 టన్నుల వరకు అక్రమంగా తరలిస్తున్నా కమీషన్లకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారు. కమీషన్లు ముట్టజెప్పితే అధిక టన్నేజీతో వెళ్తున్న టిప్పర్ లారీలకు పోలీసులే దగ్గరుండి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం గమనార్హం!

ఎర్రచందనం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు


శిక్ష పడిన నిందితుడు యేసురత్నంరెడ్డి

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా నిలువ ఉంచిన కేసులో చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం బాలగంగనపల్లి పంచాయతీ నాగూరుపల్లికి చెందిన నాగూరు యేసు రత్నంరెడ్డికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు సెషన్స్ జడ్జి ఎ.నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ హరిప్రసాద్ కథనం మేరకు.. 2017 జనవరి 6న అందిన సమాచారం మేరకు జీడీ నెల్లూరు పోలీసులు నాగూరుపల్లిలోని నాగూరు యేసురత్నంరెడ్డి ఇంటి పరిసరాల్లో తనిఖీ చేశారు. ఈ క్రమంలో మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పొలం పక్కన ఉన్న ఎర్రచందనం చెట్టును నరికి ఎక్కువ ధరకు విక్రయించాలని షెడ్‌లో భద్రపరిచినట్టు యేసురత్నంరెడ్డి తెలిపాడు. 65 కిలోలున్న దుంగలను పోలీసులు ఫారెస్ట్ అధికారులకు అప్పగించి అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అతనిపై నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ నగేష్ వాదించారు.

భూ మాఫియా నుంచి రక్షించండి


వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు డీవీ రమణ, కోటేశ్వరరావు

తిరుపతి రూరల్: 'రూ.వందల కోట్ల విలువైన స్వామి హథీరాంజీ మఠం భూములు కబ్జాకు గురవుతున్నాయి. నిత్యం భూ మాఫియా దాడులు, దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురవుతున్నాం. భూ మాఫియా నుంచి గ్రామస్తులను రక్షించండి. మహాప్రభో..' అంటూ సాయినగర్, లింగేశ్వర్‌నగర్ పంచాయతీల ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయినగర్, లింగేశ్వరనగర్ సర్పంచ్‌లు డీవీ రమణ, కోటేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో రూ.వందల కోట్ల విలువైన ఎకరాల కొద్దీ మఠం భూములు ఉన్నాయన్నారు. ఇటీవల రెండు వర్గాలకు చెందిన రౌడీలు ఆ భూముల్లో అధిపత్యం కోసం దౌర్జన్యాలకు తెగబడుతున్నారని చెప్పారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరస్పరం కేసులు సైతం నమోదు అయినట్లు చెప్పారు. అయితే మఠానికి చెందిన ఈ భూములను పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో దౌర్జన్యాలను, దాడులను అరికట్టి ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. అధికారులు స్పందించకుంటే ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఈ వినతి పత్రం కాపీని సీఎంకు, డిప్యూటీ సీఎంకు, మంత్రికి, ఎమ్మెల్యేకు పంపిచారు.

సత్యవేడులో జిల్లాస్థాయి రగ్బీ క్రీడా పోటీలు


సత్యవేడులో రగ్బీ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

సత్యవేడు: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూలు మైదానంలో జిల్లాస్థాయి రగ్బీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ హైస్కూలు హెచ్ఎం భారతి తెలిపారు. సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రగ్బీ జిల్లాస్థాయి క్రీడాకారుల పోటీలు సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగాయి. ఈ సందర్భంగా 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రగ్బీ పోటీలో అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. పోటీలను టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్రీపతి బాబు, ప్రధానోపాధ్యాయులు, పీడీలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జిల్లాస్థాయి రగ్బీ పోటీలు సత్యవేడులో నిర్వహించడంతో సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలకు గుర్తింపు వచ్చిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలో క్రీడాకారులు గెలుపొంది, సత్యవేడుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపిన వివిధ పాఠశాలల క్రీడాకారులలో అండర్–14 బాల, బాలికలు 28 మందిని, అండర్–17లో బాల, బాలికలు 28 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

దాతల సాయంతో భోజన వసతి

మండలంలోని శాంతకుమార్, లక్ష్మీనాథ్, బాబు, బాలచంద్రారెడ్డి, శ్రీపతి బాబు, బాషా, ప్రవీణ్‌కుమార్ రెడ్డి కలసి క్రీడల్లో పాల్గొన్న 300 మందికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కే.భారతి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వీకే పరమశివం, శశి, షణ్ముగం, పీడీలు బి.కుమార్, కిషోర్, భక్తవత్సలం, లోకనాథం, చెంగల్ రాయలు, ఢిల్లీరాణి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు


స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని యాగశాలకు వేంచేపు చేసి పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రాణాయానం చేశారు. తర్వాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్లను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర ప్రతిష్ఠ చేశారు. పవిత్రోత్సవాల కారణంగా సోమవారం నుంచి 30వ తేదీ వరకు కల్యాణోత్సవం, స్వర్ణ పుష్పార్చన, అష్టోత్తర శత కళశాభిషేకం, ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉత్సవాల్లో పాల్గొనదలచిన గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించాలని టీటీడీ అధికారులు తెలిపారు. వారికి ఒక పవిత్రం, ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


విజేత జట్లతో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు

ఏర్పేడు: మండలంలోని పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్రస్థాయి అండర్–14 బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక జరిగినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. పోటీలకు చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని 14 నియోజక వర్గాల నుంచి విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. అండర్–14 బాలికల పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 18 మంది, బాలుర పోటీల్లో 15 మంది ఎంపికై నట్లు పేర్కొన్నారు. నవంబరు 7వ తేదీన పల్నాటి జిల్లా, కారంపూడిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొననున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ చైర్మన్ బొల్లినేని జగన్నాథ నాయుడు దుస్తులు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు లోకేష్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో డిగ్రీ విద్యార్థి అరెస్టు

తిరుపతి రూరల్: గంజాయి సేవించడమే కాకుండా అక్రమంగా రవాణా చేస్తున్న డిగ్రీ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ వెంకటపతి నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో సోమవారం పోలీస్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. బ్రిడ్జి సమీపంలో ఇద్దరు వ్యక్తులు అధికారులు చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో వెంబడించిన పోలీసులు తాటితోపు గ్రామానికి చెందిన బీసీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థిని అరెస్టు చేశారు. అతని నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా నగరికి చెందిన శివకుమార్ నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో వ్యక్తిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

130 రోజుల్లో 130 అభివృద్ధి కార్యక్రమాలు


మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి అర్బన్: 130 రోజుల పాలనలో 130 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. తిరుచానూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో కూటమి నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. జనవరిలో రోడ్లు బాగు చేయిస్తామని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా నుంచి చెన్నైకి ఇసుక తరలిస్తున్నారంటూ పదేపదే పత్రికల్లో వస్తున్న కథనాలపై ఆయన స్పందించారు. ఇసుక జోలికి వెళ్లరాదని పేదలకు సక్రమంగా అందేలా చూడాలని చెప్పారు. తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పార్టీలో ఉండే లోటుపాట్లును సవరిస్తామని చెప్పారు. మూడు పార్టీలు కూటమిగా ఉన్న నేపథ్యంలో వివాదాలు ఉంటాయని, వాటికి పరిష్కారం చూపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కురుగొండ రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, నాని, విజయశ్రీ, సునీల్‌కుమార్, టీడీపీ నేతలు నరసింహయాదవ్, సుగుణమ్మ, ఎస్వీ నాయుడు, మునిరామయ్య, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహకారం.. పోరు రసవత్తరం

తిరుపతి సిటీ/అలిపిరి: టీటీడీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు డైరెక్టర్ పదవులకు జరిగిన ఎన్నికలు సోమవారం రసవత్తరంగా సాగాయి. సార్వత్రిక ఎన్నికలను తలపించేలా హోరాహోరీగా జరిగిన ఎన్నికల పోరులో నగదు ఏరులై పారింది. ఏడు డైరెక్టర్ పదవులకు జరిగిన ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సోమవారం ఉదయం 7 నుంచి 2 గంటల వరకు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. తిరుమల పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులు తిరుపతి ఎస్‌జీఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి సాయంత్రం 6 గంటలకు చేరుకున్నాయి. మూడు రౌండ్ల కౌంటింగ్ ప్రక్రియ కోసం 8 టేబుల్‌ను ఏర్పాటు చేసి, 25 బ్యాలెట్ పేపర్లను ఒక కట్టగా కట్టి కౌంటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

ఓటింగ్ సరళి ఇలా...

తిరుమల, తిరుపతిలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 6,349 ఓటర్లకుగాను 5,553 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి ఉమాపతి వెల్లడించారు. ఇందులో తిరుమల ఎస్వీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 10 పోలింగ్ కేంద్రంలో 2,542 మంది ఓటర్లు ఉండగా 2,217మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే తిరుపతి ఎస్‌జీఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 14పోలింగ్ బూత్‌ల్లో 3,807మంది ఓటర్లు ఉండగా 3,336 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఓటుకు నోటుదే పైచేయి అంటున్న ఉద్యోగులు

నగదు ఏరులై పారించారని టీటీడీ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఓటుకు నోటుదే పైచేయి అంటూ చమత్కిరిస్తున్నారు. గెలుపు రేస్‌లో ఉన్న ప్రధాన అభ్యర్థులు ఓటుకు పెద్ద మొత్తంలో నగదు పంపిణీ చేశారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఓటుహక్కు ఉన్న ప్రతి ఉద్యోగి ఇంటి తలుపు తట్టి నగదు అందించారని ఆరోపణలు చక్కర్లు కొడుతున్నాయి.

అర్ధరాత్రి దాటాకే ఫలితాలు

ఏడు డైరెక్టర్ పోస్టులకు జరిగిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సోమవారం రాత్రి 8గంటలకు ప్రారంభమైంది. 25బ్యాలెట్ పత్రాలను ఒక బండల్‌గా ఏర్పాటు చేసిన అనంతరం ఓట్ల లెక్కింపు కొనసాగించనున్నారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున 2గంటల సమయం వరకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనున్నట్లు తెలిసింది. తుది ఫలితాలు మంగళవారం ఉదయం వెలువడనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఉచిత ఇసుక విధానం..

కొందరికి చుట్టం

- మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి


ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

శ్రీకాళహస్తి: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం కొందరికి చుట్టంగా మారిందని, రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలకు చెక్ పెడితే, అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని కార్మిక సంఘాల నాయకలు అన్నారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ స్థానిక అవసరాల పేరుతో కొందరు రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ఈ క్రమంలోనే దొమ్మరపాళెంలో అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొని చియ్యవరం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం, రెండు ఎకరాల సాగుభూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక రవాణా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే అనుమతి ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, తహసీల్దార్ అనుమతి ఉంటేనే ఇసుక రవాణాకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ మణి, జాకీర్, గంధం మణి, కుమార్, రంగయ్య, వెంకటేష్, అన్వర్‌బాషా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5.74లక్షల నగదు చోరీ

తడ: మండలంలోని గ్రద్దగుంట సమీపంలో ఉన్న కోస్టల్ లాబొరేటరీస్ కంపెనీలో రూ.5.74 లక్షల నగదు చోరీకి గురైనట్టు సోమవారం తడ పోలీస్ స్టేషన్‌లో కంపెనీ ప్రతినిధి ఎస్‌కే కాలేషా ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కొండప్పనాయుడు కథనం మేరకు.. కంపెనీ మేనేజర్‌గా ఉన్న కాలేషా కంపెనీ మెయింటినెన్స్, సిబ్బందికి దీపావళి కానుకలు ఇచ్చేందుకు ఎండీ సమకూర్చిన రూ.6 లక్షల నగదును సూళ్లూరుపేట బ్యాంక్ నుంచి ఈ నెల 17వ తేదీన డ్రా చేసి తీసుకువచ్చాడు. అందులో రూ.లక్ష నగదును క్యాషియర్‌కి ఇచ్చి, మిగిలిన రూ.5 లక్షలు తన టేబుల్ డ్రాలో ఉంచాడు. క్యాషియర్ కూడా రూ.26 వేల ఖర్చు చేసి, మిగిలిన రూ.74 వేలు తన డ్రాలో పెట్టి శనివారం ఇంటికి వెళ్లి పోయాడు. తిరిగి సోమవారం వచ్చి చూసే సరికి ఆఫీస్ డోర్ లాక్ కట్ చేసి, రెండు డ్రాల్లో నుంచి రూ.5.74 లక్షల నగదును చోరీ చేశారు. ఈ విషయమై మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి డీఎంఅండ్‌హెచ్‌ఓపై విచారణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): తిరుపతి డీఎం అండ్ హెచ్ఓ శ్రీహరిపై వచ్చిన ఆరోపణలపై అధికారులు సోమవారం చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓగా పనిచేసిన సమయంలో డెప్యుటేషన్‌లో ఉన్న వారితోపాటు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేగాక ఆయన చేసిన అవినీతిపై కొందరు ఆకాశరామన్న ఉత్తరం రాశారు. దీనిపై రాష్ట్ర శాఖ అధికారులు స్పందించారు. గుంటూరు డీఎంఅండ్‌హెచ్ఓ విజయలక్ష్మి, నెల్లూరు డీఎంఅండ్‌హెచ్ఓ పెంచులయ్యను విచారణ అధికారులుగా నియమించారు. ఈ క్రమంలో వారు కార్యాలయంలో 40 మంది అధికారులు, సిబ్బందిని విచారించారు. ఈ విచారణ రెండు రోజుల పాటు కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.